# ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
శుక్రవారం 6 జూన్ 2025


## 11లోగా ఏకరూప దుస్తులు అందేలా చూడాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలకు ఈ నెల 11వ తేదీలోగా ఏకరూప దుస్తులు చేరేలా సీసీలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం సదానందం, ఎంఈవో సుభాష్ అన్నారు. ఏపీఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడా రు. ఏకరూప దుస్తుల వివరాలు తెలుసుకుని పాఠశాలలు పునఃప్రారంభం ముందు రోజు పాఠశాలలకు చేరేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ సూచనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పరిశీలించి.. సూచనలు చేసి..



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

సిర్పూర్(టి), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట, హీరాపూర్, చుంచుపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను గురువారం సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రహీముద్దీన్‌ను వివరాలు అడిగి తెలుసుకు న్నారు. రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుని, సమస్యలు పరిష్కరించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి):** రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు వెంటనే పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని జైనూర్ మార్కెట్ కమి టీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు అన్నారు. మండల కేంద్రంతోపాటు బాబ్జీపేట్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూమి సమస్యలు ఉన్న రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రథోడ్ ప్రహ్లాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ మాడవి చిత్రు, ఆర్‌ఐలు హన్మంత్‌రావు, నవీన్‌కుమార్, జాదవ్ అంబాజీ, ఆత్రం వినాయక్‌రావు, ఆత్రం ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

కౌటాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో హనుమంతు అన్నారు. ముత్తంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కన్వర్షేన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహించే బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గురువారం బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిబాటలో పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించాలన్నారు. అంగన్‌వాడీలలో ఐదేళ్ల నిండిన ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఎస్‌ఎస్‌జీ గ్రూపు సభ్యులు, యూత్ ఆర్గనైజర్స్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోడు లొల్లి

- భూములను వదిలేది లేదంటున్న రైతులు
- హరితహారం పేరిట మొక్కలు నాటేందుకు అధికారుల యత్నాలు
- కుటుంబాలతో కలిసి అడ్డుకుంటున్న గ్రామస్థులు



పోడు రైతులతో చర్చలు జరుపుతున్న అటవీ అధికారులు (ఫైల్)

చింతలమానేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మృగశిర ముందే వరుణుడి రాకతో అన్నదాత ఇక వానాకాలం పంటకు సన్నద్ధమవుతున్న వేళ పోడు భూముల లొల్లి ప్రారంభమైంది. పది రోజులుగా జిల్లాలోని చింతలమా నేపల్లి, పెంచికలపేట మండలాల్లో అటవీ అధికారులకు పోడు రైతులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటున్నది. ఉన్నతాధికారుల ఆదేశాలతో అటవీ భూమి స్వాధీనం చేసుకొని మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తాము ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములను మా ప్రాణాలు పోయినా సరే ..వదిలేది లేదని పోడు రైతులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతీ రోజు ఎక్కడో ఓ చోట అధికారులకు, పోడు రైతులకు వాగ్వాదం తప్పడం లేదు. ఈ వివాదం మరింత ముదరక ముందే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు చెబుతున్నారు.

### అధికారులతో వాగ్వాదం..

జిల్లాలోని చింతలమానేపల్లి మండలంలో ఈ వారం వ్యవధిలో డబ్బా, కొత్తగూడెం గ్రామ శివారులో రైతులు పత్తి కట్టె పీకనీయకుండా అటవీ అధికారులు రైతులను అడ్డుకోవడంతో రైతులకు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అలాగే దిందా, బండల్‌హేటి గ్రామ శివారు ప్రాంతాల్లో మొక్కలు వేసేందుకు అధికారులు, ట్రాక్టర్లు, ఎక్సకవేటర్ తీసుకెళ్లగా రైతులు అడ్డుకున్నారు. దీంతో మహిళా రైతులు, అధికారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎఫ్‌డీవో సుశాంత్ రైతులను సముదాయించి రైతులు సాగు చేసే పోడు భూమి సగం భూమి సాగు చేసుకోండని, సగం భూమిలో మొక్కలు నాటుతామని చెప్పారు. కానీ రైతులు ససేమిరా ఒప్పుకోకపోవడంతో అధికారులు సాయంత్రం వరకు వేచి చూసి వెనుదిరగాల్సి వచ్చింది. పది రోజులుగా అక్కడే అధికారులు మకాం వేయగా ఎప్పుడు ఏం జరుగుతందోనన్న ఆందోళన రైతుల్లో ఉంది.

పెంచికలపేట మండలంలోని జైహింద్‌పూర్ శివారులో అటవీ అధికారులు మొక్కలు వేసేందుకు ప్రయత్నాలు సాగించగా పోడు రైతులు అడ్డుకోగా వారి మధ్య ఘర్షణ నెలకొంది. మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు జిల్లా, మండల పర్యటనలు చేసినప్పుడల్లా రైతులను ఇబ్బంది పెట్ట వద్దని అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలం అవుతున్నారన్న ఆరోపణలున్నాయి.

### ఏటా ఇదే పరిస్థితి..

పోడు భూముల విషయంలో రైతులకు, అధికారులకు ఇదే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వాలు రైతుల కోసం శాశ్వత పరిష్కారం చూపుతామని హామీలు ఇస్తున్నప్పటికీ అవి ఆచరణలో కన్పించడం లేదు. గతంలో 2006లో పోడు రైతులకు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో రెండు డివిజన్లు ఉండగా 8 రేంజ్‌లున్నాయి. అటవీ సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అధికారులు పోడు భూముల విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడు తున్నారు. జిల్లాలోని గిరిజనులు, గిరి జనేతరులు పోడు భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే జిల్లాలో దాదాపుగా 28,500 వరకు పోడు రైతులుండగా, దాదాపుగా 95 వేల ఎకరాలకు వరకు పోడు వ్యవసాయం చేస్తున్నట్లు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి.

### మా భూములు వదులుకోం



దిందా గ్రామ సమీపంలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

**చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి):** మా భూమిని వదిలేది లేదు.. కొత్తగా కొట్టేది లేదని దిందా గ్రామానికి చెందిన పోడు రైతుల దిందా సమీపంలో గల పోడు భూముల్లో టెంట్ వేసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 30, 40 ఏళ్ల నుంచి తాము పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని చెప్పారు. అటవీ శాఖాధికారులు భూముల స్వాధీనం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. మా ప్రాణాలు పోయినా సరే భూములను వదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కొత్తగా ఒక్క చెట్టును కూడా కొట్టి పోడు సాగు చేయమని, ఇప్పటి వరకు సాగు చేస్తున్న భూములను ఎట్టి పరి స్థితుల్లో వదులు కోమన్నారు. ఈ నిరసనలో పోడు రైతులు, మహిళలు, చంటి పాపలతో సుమారు 300 మంది పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వారికి మద్దతు తెలిపారు.

### 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం..

**దోకే జలపతి, దిందా, పోడు రైతు**



30 ఏళ్లుగా సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు ఫారెస్టు అధికారులు వచ్చి మొక్కలు నాటే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో పాలకులు పోడు భూము లకు పట్టాలిస్తామని చెప్పినా చర్యలు తీసుకో లేదు. ప్రభుత్వం మా లాంటి పేద రైతుల పొట్ట కొట్టొద్దు. మేము సాగు చేసుకునే భూముల జోలికి రాకుండా చూడాలి.

### అధికారులు చర్యలు తీసుకోవాలి..

**రౌతు పద్మ, మహిళా రైతు, దిందా**



పోడు భూముల సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. పోడు భూముల సాగు చేసి జీవనం సాగిస్తున్నాం. ఇలాంటి పేద రైతుల పట్ల కర్కశంగా వ్యవహరించి అధికారులు భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



కాగజ్‌నగర్‌లో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య

ఆసిఫాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సుమారు 30 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆన మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకుని మొక్కలు నాటాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీఎం ఉద్యోగులు, కార్మికులు ఉదయం ర్యాలీ నిర్వహించారు. జీఎం ఎంఎస్ గిరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. కాగజ్‌నగర్ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీజీ ఎఫ్‌డీసీ డివిజనల్ మేనేజర్ శ్రావణి, ఎస్పీఎం డీజీఎం గిరిష్, ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్, లక్ష్మణ్, జలపతి, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

**బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి):** పర్యావరణాన్ని పరరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బెజ్జూరు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇందుర్‌గాం బీట్ పరిధిలోని సమ్మక్క- సాలమ్మ గద్దెల వద్ద అటవీ ప్రాంతాల్లో గ్రామస్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి మల్లికార్జున్, బీట్ అధికారులు మురళీ, వెంకటేష్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

**పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్‌ఎస్‌వో జగన్మోహన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నిషా జోహ్రి జగేంద్ర కుమార్ జోహ్రి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు రాజాగౌడ్ తమ మిత్రులతో కలిసి ఎల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భుజంగరావు, ఉపాధ్యాయులు తిరుమల్‌గౌడ్, సాయికుమార్‌గౌడ్, మల్లన్నగౌడ్, అనీల్ కుమార్, రమాకాంత్, గణేష్, మహేష్, వెంకటేష్, రాజేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**కెరమెరి, (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలని ఎస్సై మధుకర్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, ఎఫ్ఆర్వో మజారుద్దీన్, ఏపీఓ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

**దహెగాం, (ఆంధ్రజ్యోతి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కుంచవెల్లి గ్రామ పంచాయతీ కాఆర్యలయంలో ప్రత్యేకాధికారి తహసీల్దార్ మునావర్ షరీఫ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో రవికుమార్, కార్యదర్శి సుధారాణి, నాయకులు రాజన్న, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, ఎస్‌హెచ్‌జీ ఎస్సై జి విలేజ్ ఆర్గనైజర్ అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

**సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి):** అటవీ రేంజ్ అధికారులు మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి వేణుగోపాల్‌చారి, ఎఫ్‌ఎస్‌ఓ మోహన్‌రావు, ఎఫ్‌బీఓ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో మొక్కలు నాటుతున్న ఏఎస్పీ చిత్తరంజన్

**తిర్యాణి, (ఆంధ్రజ్యోతి):** అటవీ శాఖ కార్యాలయం నుంచి సమ్మక్క- సారలమ్మ గద్దెల వరకు తిర్యాణి అటవీ శాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారులు ఇక్బాల్ మోహినుద్దీన్, భీమ్లానాయక్, ఉజ్వల ప్రసా ద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**జైనూర్, (ఆంధ్రజ్యోతి):** మారుమూల గ్రామాల్లో అధికంగా చెట్లు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ కోరారు. మండల కేంద్రంలో అటవీ శాఖ అధ్వర్యంలో వన మహోత్సం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోడేఘాట్ రేంజీ అధికారి జ్ఞానేశ్వర్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



బెజ్జూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ అధికారులు



కెరమెరిలో మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు



దహెగాంలో..

## పోలీస్ విధులకు ఆటంకం
## ఇద్దరిపై కేసు

బెజ్జూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలుగుపల్లి వారసంతలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు విధులకు ఆటంకం కలిగించారు. గురువారం సాయంత్రం సలుగుపల్లి వారసంతలో ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. దహెగాం మండలానికి చెందిన సంజీవ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా తనిఖీల్లో భాగంగా పోలీసులు నిలిపారు. దీంతో సంజీవ్ బొగుడగూడ గ్రామానిక చెందిన గోమాస దీపక్, నారాయణ అనే వ్యక్తులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎస్సై వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం జరిగి ఎస్సై చొక్కా కాలర్‌ను పట్టుకున్నారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

లింగాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృత్‌రావు గూడలో మనస్తాపంతో గురువారం ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుంరం అశోక్‌కుమార్ (19) అనే వ్యక్తి గురువారం స్నేహితుడి పెళ్లికి వెళతానని తల్లి పార్వతిబాయిని అడిగాడు. తల్లి వొద్దని వారించింది. దీంతో మనస్తాపం చెందిన అశోక్‌కుమార్ ఇంట్లో వాళ్లు చేను పనులకు వెళ్లిన అ నంతరం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా చనిపోయి ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

» చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకుల వినతి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాహ క్కు చట్టం అమలు చేయాలని గురువారం పీడీఎస్‌యూ నాయకులు కలెక్టరేట్ కార్యాలయంలోని సూపరింటెండెంట్ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉందని చెప్పారు. తక్షణమే ప్రభు త్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని కోరారు. విద్యాహక్కు చట్టం అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ సమీర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

» డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ఉద్యోగులు

ఆసిఫాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ షఫి యోద్దీన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు వురు మాట్లాడుతూ ఉద్యో గులకు రావాల్సిన మే నెల వేతనంతో పాటు పెండిం గ్‌లో ఉన్న ఏడు నెలల పీఆర్సీ డబ్బులను వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగులకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం ఈ క్యాడర్లను ఏర్పాటు చేసిందన్నారు. వీరికి పనికి తగిన క్యాడర్ ఫిక్స్ చేసి ఆ క్యాడర్లకు సమాన మైన బేసిక్ వేతనంను అమ లు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్‌గౌడ్, శంకర్, ముస్తక్, సంగీత పాల్గొన్నారు.

## చికెన్ ధర రూ. 280కి చేరిక



చికెన్ విక్రయిస్తున్న వ్యాపారి

వాంకిడి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు పైపైకి చేరుతున్నాయి. వేసవితాపానికి తట్టుకోలేక కోళ్ల మృత్యువాత పడుతుండడంతో పాటు ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేకపోవడంతోనే ధరలు పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. బర్డ్‌ఫ్లూ భయంతో రెండు నెలల పాటు కేజీ రూ. 150 నుంచి 180 మధ్యే ఉంది. కానీ ఇటీవల కాలంలో చికెన్ ధర ఒక్క సారిగా పెరిగిపోయింది. ప్రస్తుతం 280 రూపాయలు పలుకుతోంది. బర్డ్ ఫ్లూ భయంతొలగడంతో పాటు వేసవి కారణంగా కోళ్ల ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ అమాంతంగా పెరిగినట్లు చెబుతున్నారు. నెల రోజుల క్రితం కిలో కోడి మాంసం 150 నుంచి 180 రూపాయలకు పలికింది. నెలరోజుల వ్యవధిలోనే ధరలు కొండెక్కిపోయాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ ఉండడంతో విందు భోజనాల్లో చికెన్ వాడకం ఎక్కువగా ఉండడంతో కోళ్ల విక్రయాలు అమాంతంగా పెరిగాయి. దీంతో మార్కెట్‌లో చికెన్ కొరత ఏర్పడింది. . శుభకార్యాల ప్రభావం, ఎండవేడిమితో కోళ్ల మృత్యువాత పడుతుండడమే చికెన్ ధరలు పెడగడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

## నర్సరీల్లో మొక్కల పెంపకానికి చర్యలు

● కోట ప్రసాద్, కాగజ్‌నగర్ ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి :** నర్సరీల్లో మొక్కల పెంపకానికి తీసుకుంటున్న చర్య లు ఏంటి ?

**ఎంపీడీవో :** నర్సరీల్లో మొక్కల పెంపకానికి తీసుకుంటున్న చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలం ఆరం భంలోనే మొక్కలు నాటే కార్యక్ర మం ఉంటుంది కాబట్టి నర్సరీల్లో మొక్కలు పెంపకంపై పక్కాగా చర్యలు తీసుకున్నాం. ఇప్పటి వరకు నర్సరీల్లో మొక్కలు ఏపుగా వచ్చా యి. నాటేందుకు అంతా సిద్ధం చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి :** పారిశుధ్య పనులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**ఎంపీడీవో :** వర్షాలు కురుస్తున్నందున గ్రామపంచాయతీల సి బ్బందిని పారిశుధ్యంపై అప్రమత్తం గా ఉండాలని సమాచారం ఇచ్చాం. గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. క్లోరినేషన్ పనులు కూడా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించాం. ప్రజలకు కూడా పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి :** ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నారా?

**ఎంపీడీవో :** ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బం దులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. మండలంలో అన్నీ గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఉపాధి హామీ పనుల తాలుకూ బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

**ఆంధ్రజ్యోతి :** అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ఏం చర్యలు తీసుకుంటు న్నారు?

**ఎంపీడీవో :** మండలంలో వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. సమావేశాల్లో తరుచూ సిబ్బందిని పనుల విషయం అడిగి తెలుసుకుంటూ సూచనలు చేస్తున్నాం. నిర్ల క్ష్యం చేయకూడదని ఆదేశిస్తున్నాం.

- కాగజ్‌నగర్, ఆంధ్రజ్యోతి

# విత్తనపూజకు వేళాయే



● ఆదివాసీ గ్రామాల్లో సందడి



వనదేవతకు మొక్కుతున్న ఆదివాసీలు

జైనూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అనాదిగా వస్తున్న ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపా డుకోవడంలో ఆదివాసీలు ముందుంటారు. జూన్ 8న మృగశిర కార్తె ప్రవేశిచనుండడంతో ఆదివాసీలు విత్తన పూజలు ప్రారంభించారు. పోడుభూముల్లో సాగుకు తరలివెళ్లే ముందు ఆదివాసీ గూడాల్లో సందడే సందడి. మైదాన ప్రాంతంలోని గ్రామాల్లో ఏరువాక సాగినట్టే, సాగుకు బయలు దేరే ముందు ఆదివాసీ గూడాల్లో విత్తన పండుగకు సిద్ధమయ్యారు. ఏటా తొలకరి జల్లులతో ఆదివాసీ గూడల్లో విత్తనాల పండుగ వాతావారణం నెలకొంటుంది.

### ● విజంగ్ మొహుతుర్..

విజంగ్ అంటే విత్తనాలు మొహుతుర్ అంటే ముహూర్తం. సాగుకు ముందు విత్తనాలు దేవుడికి చూపించడం. ఇది ఆదివాసీ



దేవుడికి నైవేద్యం సమర్పిస్తున్న ఆదివాసీలు

రైతుల ప్రధాన ఆచారం. ప్రతీ ఆదివాసీ గ్రామాల్లో అందరు కలిసి విత్తనాల పండగ చేసుకుంటున్నారు. గత ఏడాది పండించిన ఆహారధాన్యాలను తెచ్చుకొని మోదుగ ఆకుల్లో జమ చేస్తారు. మార్కెట్లో కొన్న విత్తనాలను వీటితో కలపడం సరైంది కాదని వీళ్ల ప్రగాఢ విశ్వాసం. అందుకే తాము పండించిన పంట ధాన్యాలను మాత్రమే తీసుకోస్తు న్నారు. ఈ ధాన్యాలను దేవుళ్ల ముందు ఉంచి పూజలు చేస్తారు. పంటకు నష్టం రాకుండా చూడాలని వేడుకుంటారు.

### ● నువ్వుల నూనెతో..

విత్తనాల పూజలో అభిషేకం కోసం మార్కెట్లో కొనుగోలు చేసిన నూనె మాత్రం వారు ఎట్టి పరిస్థితిల్లోను వాడరు. తాము తయారు చేసిన నూనె మాత్రమే వాడుతారు. అందుకే ప్రతి గ్రామాల్లో కానుగలతో నూనె తీశారు. ఇలా తీసిన నూనెతో ప్రత్యేక వంటకాలతో అడవి తల్లికి పూజలు చేస్తారు. అనంతరం సామూహిక భోజనాలు చేస్తారు. విత్తనాల పూజలు చేయడానికి వెళ్లే దేవస్థానాలను ప్రధాన ఠికానాలు అంటారు. వీటినే అవ్వల్‌పెన్ అని పిలుస్తారు. వివిధ ప్రాంతాల వారు తమ దగ్గర్లోని ఠికానాలకు వెళుతున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సుంగాపూర్ అవ్వల్‌పెన్, కెరమెరి, సిర్పూర్(యు) మం డలాల సరిహద్దులో గల అడవి ప్రాంతంలో ఉంది. కవ్వాల టైగర్ రిజర్వు ఫారెస్టుకు ఆను కొని ఉన్న ఎత్తైన గుట్టపై దెబ్బల రాజుల అవ్వల్‌పెన్ ఉంది. లింగాపూర్ మం డలంలోని జాముల్‌ధరా గ్రామ అటవీ ప్రాంతంలో కన్నెపెల్లి మోతుగూడ అవ్వల్‌పేన్ ఉం ది. తిర్యాణి మండంలోని దంతన్‌పెల్లి తర్వాత భీమల్‌పేన్ ఉంది. సిర్పూర్(యు) మండ లంలోని సీతగోంది దగ్గర ఘాడ మసేమల్ పెన్ ఉంది. ఏజెన్సీ ప్రజలు తమ గ్రామ చుట్టు ప్రక్కల దేవస్థానాల్లో మొక్కలు చెల్లించుకుంటూనే ఇక్కడే విత్తనాలకు పూజలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఐదు రోజులుగా ప్రారంభమైంది. విత్తన సీజనులో సుమారు నెల రోజుల పాటు ఆయా ప్రాంతాల ఆలయాల్లో సందడి ఉంటుంది.

# గ్రామస్థులను ఇబ్బంది పెట్టొద్దు



అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అటవీ అధికారులు నిబంధనల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఆదివాసులు చేస్తున్న ధర్నాకు గురువారం మద్దతు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఒత్తిడితో కింది స్థాయి సిబ్బంది పెట్టే ఇబ్బందులతో జిల్లాలో ప్రజలు ప్రశాంతంగా జీవించే పరిస్థితి లేదన్నారు. దశాబ్దాలుగా నివసిస్తున్న గ్రామాల్లో కొత్తగా బోర్‌వెల్, సిమెంట్ రహదారులు, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోనివ్వక పోవడం దీనికి నిదర్శణమన్నారు. సిర్పూర్ నియోజక వర్గంలోని పాపన్నపేట, గంగాపూర్ గ్రామాల్లో బోర్‌వెల్ వేసే పరిస్థితి లేదని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి క్షేత్రస్థాయిలో జరుగుతున్న అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇప్పటికే జిల్లా ప్రజలు పడుతున్న ఇబ్బందులు చాలా ఉన్నాయని తెలిపారు. మళ్లీ కొత్తగా జీవో 49 తీసుకు వచ్చి టైగర్ రిజర్వుగా ప్రకటించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇది అమలులోకి వస్తే నిర్బంధం మరింత పెరుగుతుందని చెప్పారు. వెంటనే దీన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయకుంటే తిరుగుబాటు తప్ప ప్రజలకు వేరే గత్యంతరం ఉండదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వారికి అండగా ఉంటామని తెలిపారు. టైగర్ రిజర్వు ప్రతిపాదన రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ



ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

ఆసిఫాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్ గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన హైదరాబాద్ సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా పని చేసి బదిలీపై ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలను స్వీకరించారు. ఏడాది కాలం పాటు ఎస్పీగా ఇక్కడ పనిచేసిన డీవీ శ్రీనివాస్‌రావు మెదక్ జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. గతంలో ఈయన భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్ జిల్లా భైంసా ఏఎస్పీగా, హైదరాబాద్ సౌత్‌ఈస్ట్‌జోన్ డీసీపీగా విధులు నిర్వర్తించి బదిలీపై కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు నియమితులయ్యారు. ఎస్పీగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసుశాఖ కట్టుబడి ఉంటుందని చెప్పారు. పౌరుల రక్షణ పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. సామాన్యుడికి భరోసా కల్పించే విధంగా జిల్లా పోలీసింగ్ పని చేస్తుందన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలు చేసే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సామాజిక మాధ్య మాలను వేదికగా చేసుకొని వ్యక్తిగత మత పరమైన దూషణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ హెచ్చరించారు.

## న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి




కొత్తగూడంలో ధర్నా చేస్తున్న సులభ్ కార్మికులు

మందమర్రిటౌన్/శ్రీరాంపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉన్న సులభ్ కాంప్లెక్సుల్లో పనిచేసే కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు ఐ. క్రిష్ణ డిమాండ్ చేశారు. సింగరేణి సులబ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పర్సనల్ జీఎం కవితానాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియ న్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, అశోక్, మల్లేష్, సంజీవ్, కొండపల్లి శ్రీను, ఐ. వెంకన్న, ఎస్. భూమయ్య, రాజేశ్వరి, విజయ, మహేశ్వరీ, రౌతు లక్ష్మి, ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను అమలు చేయాలి

భీమారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ కలగూర రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు దాసరి మధునయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విశాక ట్రస్టు ఆధ్వర్యంలో కంపెనీ ఏర్పాటు చేసిన ఉపాధి కల్పిస్తామని, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులు, ప్రాజెక్టులను నింపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాదిన్నర దాటినా హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. అలాగే మారుమూల ప్రజలకు నీరు, రోడ్డు సౌకర్యం సరిగ్గా లేదన్నారు. కాంగ్రెస్ నాయకుల ఇళ్ల వద్దకు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్న ఎమ్మెల్యే పేద ప్రజల కోసం రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం సరైంది కాదన్నారు. భూదందా, ఇసుక దందా కొనసాగవని ప్రతి సమావేశంలో చెబుతూనే ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులు దందాలు చేస్తున్నారన్నారు. నాయకులు రాము, లాజర్ , మణిదీపక్, పవన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అధికారుల దాడులు నిలిపివేయాలి



ఏవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏడు దశాబ్దులుగా సాగు చేస్తున్న తమ వ్యవసాయ భూములపై అటవీ అధికారులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, వీటిని నిలిపివేయాలని సిర్పూర్(టి) మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రైతులు గురువారం కలెక్టర్ కార్యాలయంలోని ఏవో కిరణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వే నంబరు 69లో ఒక్కొక్కరం రెండు నుంచి మూడు ఎకరాల భూమిని సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నా మన్నారు. ఈ భూములకు రెవెన్యూశాఖ జారీ చేసిన పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్నాయన్నారు. కొంత కాలంగా తాము విత్తనాలు వేసే సందర్భంలో అటవీశాఖ అధికారులు వచ్చి భూమిని దున్నకూడదని, విత్తనాలు వేయొద్దని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తునారని చెప్పారు. కేసులు పెడతామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. భూమిపై ఆదారపడి జీవించే తమకు అటవీ శాఖ అధికారుల నుంచి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. తమ జీవనాధారం భూముల సాగేనని, అధికారులు తమకు ఇబ్బందులు కలిగించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరికి బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ఎల్ శ్యాంరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.




## బొగ్గు ఉత్పత్తి పెరుగుదలకు చర్యలు

మందమర్రిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సంస్థలో పనుల వేగవంతంతో పాటు బొగ్గు ఉత్పత్తి పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని నూతన షావెల్స్‌ను తీసుకు వచ్చామని మం దమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. ఏరియాలోని కేకేఓసీపీలో కోటి71లక్ష92వేల4వందల 58 రూపాయలతో కొనుగోలు చేసిన రెండు కొత్త షవెల్స్‌ను గురువారం ఆయన పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఓసీలో ఉద్యోగుల, అధికారుల పనితీరు బాగుందని అభినందించారు. ఈషవెల్ అందుబాటులోకి తేవడం ద్వారా ఉద్యోగులు మరింత మెరుగైన పని తీరుతో ముందకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ బ్రాంచి సలేంద్ర సత్యనారా యణ, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, ఏరియా ఇంజనీర్ వెంకట్‌రమణ, ప్రాజెక్టుఇంజనీర్ వెంకట వంశీధర్, మేనేజర్ రామరాజు, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్, పిట్ కార్యదర్శి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు మొక్కల పంపిణీ

మందమర్రిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మందమర్రి జీఎం దేవేందర్ ఉద్యోగులకు స్థానిక జీఎం కార్యాలయంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ పదికిపైగా మొక్కలు నాటాలని తెలిపారు. గృహాల్లో జామ, నిమ్మ, దానిమ్మ, ఉసిరి, సపోట, అరటి, అల్లనేరడి, బత్తాయి లాంటి మొక్కలు కూడ అందు బాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

కాసిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గనులలో రక్షణ చర్యలు పాటించి ప్రమాదాల నివార ణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్ అన్నారు. కాసిపేట గనిపై గురువారం ఏర్పాటు చేసిన ప్రమాదాల నివారణ కార్యక్రమాలల్లో హాజరై మాట్లాడారు. ప్రమాదాలపై అధ్యయనం చేస్తే జూన్ లోనే ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ప్రమాదాలను నివారించేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి మాటూరి రవీందర్, కేకే గ్రూపు ఏజెంటు రాంబాబు, కాసిపేట గని మేనేజర్ భూశంకరయ్య, ఏఐటీయుసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, మీనుగు లక్ష్మీనారాయణ, రక్షణ అధికారి నిఖిల్ అయ్యర్, డిప్యూటి మేనేజర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

# అవగాహన కల్పించి.. ప్రతిజ్ఞ చేయించి..



మొక్కలు నాటుతున్న మందమర్రి జీఎం దేవేందర్, పాల్గొన్న అధికారులు



రెబ్బెనలో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

మందమర్రిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గనులపై గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అధికారులు మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యమని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జీఎం కార్యాలయంలో గురువారం ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం విజయ్ ప్రకాశ్; ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, పీఎం శ్యాం సుందర్, ఇన్వి రాన్‌మెంట్ అధికారి వెంకట్‌రెడ్డి ఫారెస్టు అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు. ఏరియాలో ని ఆయా గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులు, ఉద్యోగులు పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ట్రైనీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ. రవళి, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, కంది శ్రీని వాస్ తదితరులు పాల్గొన్నారు.

**కాసిపేట, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ సింగరేణి 1, 2గనులపై ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి మొక్కలు నాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి రవీందర్, కేకే గ్రూపు ఏజెంటు రాంబాబు, ఏఐటీయుసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**జైపూర్, (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంర క్షించాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి డైరెక్టర్ హాజరై మాట్లాడారు. అనంతరం పర్యావరణం -నడక అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, అధికారులు జేఎన్ సింగ్, శివ ప్రసాద్, సంతోష్‌కుమార్, మురళీధర్, అజ్మీర తుకారాం, చంద్రమణి పాల్గొన్నారు.

**రెబ్బెన, (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణలో పూర్వీకులు అవలంబించిన జీవన విధానాలను ఆదర్శంగా తీసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం ఖైరిగూడ, ఏరియా హాస్పిటల్, గోలేటి సీహెచ్‌పీలోని అన్ని డిపార్టుమెంటుల్లో ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞచేయించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బయ్య మొగిలి, ఎస్‌ఓటు జీఎం కె రామజమల్లు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ హితమే మన అభిమతం కావాలి




సీఎండీ సందేశ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జీఎం శ్రీనివాస్

**శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి):** పర్యావరణహితమే మన అభిమతం కావాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్స వం సందర్భంగా జీఎం కార్యాలయంలోని ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. సీఎండీ బలరామ్ సందేశాన్ని పోస్టర్ల రూపంలో ఆవిష్కరించారు. పర్యావరణంపై నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో గెలు పొందిన ఉదోగులకు జీఎం బహుమతులు అందిం చారు. అనంతరం ఆయన 500 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు కె. కిరణ్ కుమార్, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో టి. శ్రీనివాస్, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్ కుమార్, శిరీషా రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, తదితరులు పాల్గొన్నా రు. ఆర్‌కే 6 గనిపై ఇన్‌చార్జి మేనేజర్ కాదాసి శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఇంకు డుగుంతలు తవ్వాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచించారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, రక్షణాధికారి కొమురయ్య, సంక్షేమాధికారి సురేందర్, తదితరులు పాల్గొన్నారు. ఆర్‌కే 7 గనిపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, వంశీకృష్ణ, శ్రీనివాస్, రవి కుమార్ విజేతులగా నిలిచారు. వారికి గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి సంతోష్ రావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, పిట్ కార్యదర్శి సారయ్య, సంక్షేమాధికారి శంతన్, తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య


లింగయ్య(ఫైల్)

జైపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారావుపేట పరిధి దుబ్బపల్లి గ్రామానికి చెందిన కామెర లింగయ్య(60) అనే వృద్ధుడు అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాపీ మేస్త్రీగా పనిచేసే లింగయ్య కూతురు వరలక్ష్మికి రెండు సంవత్సరాల క్రితం అప్పులుచేసి పెళ్లి చేశాడు. దుబ్బపల్లి గ్రామం శ్రీరాంపూర్ ఓసీపీలో పోతుందని డబ్బులు వస్తాయని ఆశించాడు. కానీ అలా జరగకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో అని మనస్తాపంతో మంగళవారం పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరం గల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు ఆంజనేయులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పంటమార్పిడితో ఆశించిన దిగుబడులు

నెన్నెల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) రైతులు పంట మార్పిడి చేస్తేనే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజన అన్నారు. మండలంలోని నందులపల్లిలో గురువారం పంటమార్పిడి, నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏళ్ల తరబడి ఒకే పంట సాగు చేస్తే ఆశించిన దిగుబడులు రావన్నారు. వరి, పత్తి పంటలే కాకుండా ఇతర పంటలు కూడా సాగు చేయాలని సూచించారు. సాగు లాభసాటిగా మారేందుకు ఆధునిక పద్ధతులు పాటించాలన్నారు. అధిక రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. నకిలీ పత్తి విత్తనాలు వాడ కూడదని సూచించారు. ఆమె వెంట గొళ్లపల్లి ఏఈవో షైనీ ఉన్నారు.



సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న రైతు సతీష్

# సేంద్రియ సాగులో భేష్

- సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు
- స్వయంగా గోశాల ఏర్పాటు
- పలు అవార్డులు, పురస్కారాలు అందుకున్న యువ రైతు సతీష్

చెన్నూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులను వాడకుండా సహజ సిద్ధమైన ఎరువులను తయారు చేస్తున్నాడు చెన్నూరు మండలంలోని శివలింగాపూర్ గ్రామానికి చెందిన యువ రైతు గోనె సతీష్. ఇంటి వద్దే ఘన జీవామృతం, వర్మీకంపోస్టు తయారు చేస్తున్నాడు. ఇందుకు ఆవుపేడ, ఆవు మూత్రం వాడుతున్నాడు. తనకున్న 20గుంటల భూమిలో సేంద్రియ ఎరువులతో పాటు18 సంవత్స రాలుగా కూరగాయలను సాగు చేస్తున్నాడు.

**● కూరగాయల సాగు**

ఇంటి వద్ద 20 గుంటల భూమిలో బీరకాయ, పుదీనగ్రామసమీపంలోని ఐదెకరాలను కౌలుకు తీసుకుని మూడురకాల వంకాయలు, సోరకాయలు సాగు చేస్తున్నాడు. వంకాయలు రోజు ఎనిమిది క్వింటాళ్ల వరకు, సోరకాయలు, బీరకాయలు కలిపి రోజుకు రెండు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నాయి. వీటిని హోల్‌సేల్‌గా విక్రయించి ఆదాయం పొందుతున్నాడు. సతీష్‌కు తోడుగా భార్య రజిత, తమ్ముడు భాస్కర్ సహకారం అందిస్తున్నారు.

**● గోశాల ఏర్పాటు**

మూడు సంవత్సరాల క్రితం ఇంటి వద్ద షెడ్డు నిర్మించి ఒక్క ఆవుతో గోశాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గోశాలలో 120కి పైగా ఆవులు ఉన్నాయి. ఆవుల పేడతో ఘన జీవామృతం, వర్మీ కంపోస్టు తయారుచేసి పంటలకు ఉపయోగిస్తున్నాడు. అంతేకాకుండా సేంద్రియ ఎరువుల వాడకంపై ఇతర రైతులకు అవగాహన కల్పిస్తున్నాడు. ఆవు పేడతో పిడకలు తయారు చేసి హోమాలకు, యజ్ఞాలకు అందజేస్తున్నాడు.

**● అవార్డులు, ప్రశంసాపత్రాలు**

సేంద్రియ ఎరువులతో కూరగాయలు సాగు చేస్తున్న సతీష్‌కు పలు సంస్థలు ఉత్తమ రైతుగా ఎంపిక చేసి అవార్డులు, ప్రశంసా పత్రాలు అంద జేశాయి. 2021లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో అప్పటి కలెక్టర్ భారతి హోళికేరీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. 2022లో సుస్థిర వ్యవసాయ రాష్ట్రస్థాయి రైతు చైతన్య సదస్సులో హైద్రాబాద్‌లో పుడమిపుత్ర అవార్డు, నేషనల్ ప్రీమియర్ అవార్డుకు ఎంపికై ఉత్తమ రైతు అవార్డు అందుకున్నాడు. 2024లో హైద్రాబాద్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు చేతుల మీదుగా సహస్ర కంపెనీ ఉత్తమ రైతు పురస్కారం అందుకున్నాడు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లాలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ హైద్రాబాద్ వారి చేతుల మీదుగా పుడమిపుత్ర అవార్డు అందుకున్నాడు సతీష్ తయా రు చేస్తున్న సేంద్రియ ఎరువులు, గోశాల, కూరగా యల సాగును బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో పాటు పలువురు ప్రముఖులు సందర్శించారు.


రైతు సతీష్ ఏర్పాటు చేసిన గోశాలలో ఉన్న ఆవులు

**భూమిని కాపాడేందుకు..**

**- గోనె సతీష్, రైతు, శివలింగాపూర్**

నేను 18 ఏళ్లుగా సేంద్రియ ఎరువులు తయారు చేస్తూ కూరగాయల పంటలను సాగు చేస్తున్నాను. కూరగాయాల సాగు మంచి లాభదాయకంగా ఉంది. 120 ఆవులతో గోశాలను ఏర్పాటు చేశాను. పశువుల పిడకలు కూడా తయారు చేస్తున్నాను. సేంద్రియ వ్యవసాయంపై ఇతర రైతులకు అవగాహన కల్పిస్తున్నాను. రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి సారవంతం తగ్గిపోతుంది. భూమిని కాపాడుకునేందుకు రైతులందరూ సేంద్రియ ఎరువులు వాడాలి.

## 60 డివిజన్లు..1.79లక్షల ఓటర్లు

(5వ పేజీ తరువాయి..)

పాలకవర్గాల గడువు 2025 జనవరి 28న ముగిసింది. దీంతో అప్పటి నుంచి మున్సిపాలి టీలు ప్రత్యేక అధికారుల పాలనలో నడుస్తున్నాయి. దీంతో అధికారులపైన అదనపు భారం పడి అభివృద్ధిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు మున్సిపల్ కార్పొరేషన్‌కు పాలకమండళ్లు లేకపోవడంతో కేంద్రప్రభుత్వం ప్రతీ సంవత్సరం విడుదల చేసే నిధులు కూడా నిలిచిపోయాయి. దీంతో అభివృద్ధి కుంటుపడుతుందని భావిస్తున్న ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం ద్వారా మున్సిపాలిటీలను బలోపేతం చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**● త్వరలో రిజర్వేషన్ల ఖరారు...**

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే గ్రామాలు పంచాయతీల్లో వార్డుల విభజన ప్రక్రియ ముగియగా ఓటరు జాబితాలు సైతం సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో పట్టణాల్లో వార్డుల విభజన చేపట్టగా ఆ ప్రక్రియ పూర్తికాగానే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు భావిస్తున్నాయి. రిజర్వేషన్లు కూడా త్వరలో ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

**● సిద్ధపడుతున్న ఆశావహులు...**

మంచిర్యాల కార్పొరేషన్‌లో వార్డుల విభజన ముగియడం త్వరలో రిజర్వేషన్ ప్రక్రియ కూడా చేపట్టనుండడంతో వివిధ డివిజన్లకు పోటీ చేసే ఆశావహులు అందుకు సిద్ధపడుతున్నారు. కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను టికెట్లు పొందేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

## వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి: కలెక్టర్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలతో వన మహోత్సవం కార్యక్రమణ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు గ్రామపంచాయతీల వారీగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రతీ ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేసి పరిరక్షించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

హాజీపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంనూర్ పునరావాస కాలనీలో అభయాంజనేయ, భక్తాంజనేయ, నవగ్రహ, నాగేంద్ర, గజశిఖర ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వేల సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధానదాత ఆన్‌కార్ పద్మశ్రీ సత్యనారాయణ దంపతులు పూజలో పాల్గొని భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ శివాజీ, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండేలు హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి, భూలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన

కాసిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దుబ్బగూడెం పునరావాసకాలనీలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ మందమర్రి సింగరేణి జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో మహాలక్ష్మీ,భూలక్ష్మీ విగ్రహాలను గురువారం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వినూత్న కళాఖండాల ప్రదర్శన

నస్పూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని రేడియంట్ హైస్కూల్ యాజమాన్యం, బోధన సిబ్బంది ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ట్రాష్ టు ట్రెజర్ ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాడైన ప్లాస్టిక్ వస్తువులను వినూత్న కళాఖండాలుగా తయారు చేసి ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు తమ పాత్రను పోషించాలని తెలియజేశారు. అనంతరం జిల్లా విద్యాధికారి యాదయ్యను కలిసి పర్యావరణ పరిరక్షణలో తమ విద్యాసంస్థల బాధ్యతలను వివరించారు. విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన పెంపొందించడం, విలువలను నేర్పించడం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చెన్నూరి అమన్ ప్రసాద్, ప్రిన్సిపాల్ రజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం


రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్

బెల్లంపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా భూమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును సందర్శించి మాట్లాడారు. అనంతరం మండలంలోని పెరికపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రెవె న్యూ సదస్సును సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. ఆర్డీవో హరిక్రిష్ణ, ఎంపీడీవో మహేందర్‌లు పాల్గొన్నారు.

**హాజీపూర్:** భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీవావాస్ రావు దేశ్‌పాండే అన్నారు. వివిధ సమస్యలకు సంబంధించి గురువారం హాజీపూర్ మండలంలో 52 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గుడిపేట గ్రామ శివారులో వివిధ సమస్యలకు సంబంధించి 39 దరఖాస్తులు, కర్ణమామిడి గ్రామ శివారులో 13 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మూడు రోజుల్లో ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 97 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ అతీస్, ఆర్ఐలు మంగ, ఏసయ్య, కార్యాలయ సిబ్బంది రంజిత్, అన్‌మోహన్ పాల్గొన్నారు.

**నస్పూర్:** భూ భారతి రెవెన్యూ గ్రామసభల్లో భాగంగా విలేజ్ నస్పూర్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు వివిధ సమస్యలపై 18 అర్జీలను అందించారు. గ్రామసభల్లో తహసీల్దార్ సంతోష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ హరిత, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**చెన్నూరు:** మండలంలోని కత్తెరసాల, చాకెపల్లి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు. కత్తెరసాలలో ఒక్క దరఖాస్తు రాగా, చాకెపల్లిలో మూడు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆర్ఐ అజీజ్, సిబ్బంది పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** మండలంలోని చిర్రకుంట, పొన్నారం గ్రామాల్లో రెండో రోజు గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో మొత్తం 16 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**జన్నారం:** మండలంలోని తపాల్‌పూర్ గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**దండేపల్లి:** భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రోహిత్ దేశపాండే సూచించారు. దండేపల్లి మండలం కొర్విచెల్మ, ఆల్లీపూర్‌లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ, సీనియర్ అసిస్టెంట్ ముత్తె లావణ్య, ఆర్ఐ బొద్దుల భూమన్న, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత

తాండూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని మాదారం ఎస్ఐ సౌజన్య అన్నారు. గురువారం మాదారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నీలాయపల్లిలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లోకి ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇళ్లు, దుకాణాల ఎదుట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగో రోజుకు చేరిన రిలే దీక్ష

నస్పూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం తీగ ల్‌పహాడ్ గోదాముల వద్ద కోల్ బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యజమానులు చేపట్టిన నిరహార దీక్ష గురువారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. సీసీఐ అధికారులు తమ సమస్యల పరిష్కారిం చ డంలో జాప్యం చేస్తున్నరని ఆరోపించారు. దీక్షలో గుండా సురేశ్ గౌడ్, బాస్కర్ల సుమన్, రాందేని రమేశ్, అరికోల్ల రమేశ్, జి తిరుపతి, దాసరి రాజేశ్, ఉపేందర్‌రావు, రమేష్‌రెడ్డి, ఎ సదానందం కూర్చున్నారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి: డీసీపీ



రికార్డులను పరిశీలిస్తున్న మంచిర్యాల డీసీపీ బాస్కర్

లక్షెట్టిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పోలీసు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గిడి బాస్కర్ సూచించారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ ఆకస్మికంగా పరిశీలించారు. స్టేషన్‌లోని పలు రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించిన డీసీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన సందర్శకులతో మార్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. డీసీపీ వెంట లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్ ఉన్నారు.

## ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి

దండేపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కొర్విచెల్మలో ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థులు దండేపల్లి తహసీల్దార్ రోహిత్ దేశపాండేకు వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం కొర్విచెల్మలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో గ్రామస్థులు వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రామంలో పాత గ్రామ పంచాయతీ కార్యలయం శిథిలావస్థకు గురైంది. దానికి మరమ్మతులు చేపించి దాని చుట్టు ప్రహరీ నిర్మించి ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ముద్దసాని తిరుపతి, నాయకులు ముద్దసాని భీమయ్య, మల్యాల రమేష్, గోపు మల్లేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్లాంటేషన్ మేనేజర్‌కు అవార్డు

జైపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్‌గా పనిచేస్తున్న గోగు సురేష్‌కుమార్‌కు గురువారం ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి చేతుల మీదుగా ఉత్తమ పనితీరు అవార్డు అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్‌లోని టీజీఎఫ్‌డీసీ డివిజన్ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. టీజీఎఫ్‌డీసీ ఏర్పడి దశాబ్దకాలం పూర్తయిన సందర్భంగా ప్లాంటేషన్‌ల నిర్వహణలో ఉత్తమ పనితీరుకు గాను ప్రోత్సాహకంగా ఈ అవార్డు అందజేసినట్లు సురేష్ పేర్కొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ డీడీకి సన్మానం

మంచిర్యాలకలెక్టరేట్,జూన్5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ అధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ దుర్గాప్రసాద్‌ను గురువారం జిల్లాలోని పలు పార్టీల నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, స్వచ్ఛంద సంస్థల నాయకులు పురుషోత్తం నాయక్, అధికారులు శ్రీధర్, కుమారస్వామి, రాజేందర్, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేర్చడంలో మరింత కష్టపడి గుర్తింపు సాధించాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, మల్లేష్, చైతన్య, సాగర్, బిక్షపతి, రాజమల్లు, సంతోష్, శ్రీధర్, జనార్దన్, రాజు, పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

(5వ పేజీ తరువాయి..)


మొక్కలు నాటుతున్న మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు

జిల్లా కేంద్రంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్‌మణికుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసరాల్లో పలు మొక్కలను నాటారు. జీవ జాతులకు హాని చేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని, ప్రకృతి పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, డీజీఎం అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రిటౌన్:** ప్రతీఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**బెల్లంపల్లి:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు ముందుండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపెల్లి శంకర్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో ఉపాధ్యాయులతో మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

**మంచిర్యాలకలెక్టరేట్:** మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మంచిర్యాలలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడే దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. దుర్గం అశోక్ తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపల్లిలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

నస్పూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణంలో శ్రీనిధి నృత్యాలయం ఆధ్వర్యంలో చిన్నారులకు కూచిపూడి నృత్యం వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. నస్పూర్ కాలనీలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వంద మందికిపైగా చిన్నారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎఫ్‌సీఐ సభ్యుడు చంద్రమోహన్ గౌడ్, నస్పూర్ ఎస్ఐ ఉపేందర్‌రావు, శ్రీనిధి నృత్యాలయం వ్యవస్థాపకులు, నృత్య గురువు కాపూడి వసుధ, మున్సిపల్ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణు, కోరియోగ్రాఫర్ సునార్కర్ రాంబాబు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

దండేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్ గ్రామ సమీపంలో గురువారం రాత్రి కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో మండలంలోని లక్ష్మీకాంతపూర్ గ్రామానికి చెందిన గాజుల సత్తయ్య (65) అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్య తన బైక్‌పై గురువారంరాత్రి లక్షెట్టిపేట నుంచి దండేపల్లి వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో జన్నారం వైపు నుంచి లక్షెట్టిపేట వైపునకు వెళ్తున్న కారు అతి వేగంతో ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టింది. దీంతో సత్తయ్యకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై తహసీనోద్దీన్ తన పోలీసు సిబ్బందితో అక్కడి చేరుకోని రోడ్డ ప్రమాదం తీరును పరిశీలించి మృతదేహాన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చిరికి తరలించారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


దండేపల్లిలో మాట్లాడుతున్న ఎంఈవో దుర్గం చిన్నయ్య

లక్షెట్టిపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని లక్షెట్టిపేట మండల అభివృద్ధి అధికారి సరోజ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో మీటింగ్ హాలులో గురువారం బడిబాట కార్యక్రమ సమన్వయ సమావేశంలో ఎంపీడీవో ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై అవగాహన కల్పించడంతో పాటు పాఠశాలల్లో ప్రభుత్వం కల్పించే వసతులు, సౌకర్యాలను తెలియజేయాలని సూచంచారు. కార్యక్రమంలో ఎంఈవో శైలజ, దౌడేపల్లి హెచ్ఎం తిరుపతి, సీఆర్‌పిలు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**తాండూర్:** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంఈవో మల్లేశం, ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐకేపీ, అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు, సీఆర్‌పీ నాగరాజు, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

**కాసిపేట:** మండలంలో నిర్వహించే బడిబాటను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధిఆరి అజ్మీర పురుషోత్తం నాయక్ అన్నారు. గురువారం ఐకేపీ బిల్డింగ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. తహసీల్దార్ భోజన్న, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**దండేపల్లి:** ఈనెల 6 నుంచి ప్రారంభమైయే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రతీగ్రామంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య సూచించారు. దండేపల్లి మండల పరిషత్ కార్యలయంలో గురువారం జరిగిన బడిబాట కార్యక్రమంపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపివో విజయప్రసాద్, ఐకేపి ఏపిఎం బ్రహ్మయ్య, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

**కన్నెపల్లి:** బడి బాట కార్యక్రమంలో భాగంగా బడీడు పిల్లలందర్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈవో రాము, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్ పేర్కొన్నారు. గురువారం కన్నెపల్లి ఐకేపీ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి బాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో బడీడు పిల్లలను, బడి మానేసిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ స్వామి, నారాయణ, ఏపీఎం అశోక్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఐకేపీ, అంగన్‌వాడీ టీచర్లు, పోలీసులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో బక్రీద్‌ను జరుపుకోవాలి

జైపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండగను జరుపుకోవాలని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ సూచించారు. గురువారం జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బక్రీద్ పండగ సందర్భంగా పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## ఎలక్ట్రీషియన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

జన్నారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సహకారంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఎస్టీ నిరుద్యోగులు ఉచితంగా అందించే ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలని వైటీసీ ట్రైనీ బెల్లంపల్లి స్వరూపరాణి తెలిపారు. నిరుద్యోగులకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణతోపాటు, హాస్టల్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు.

## సెక్షన్ అధికారి సస్పెన్షన్

జన్నారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శేషరాంనాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల వైల్డ్ లైఫ్ విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలు సింగ్ మేరు సందర్శన సందర్భంగా సరైన ప్రొటోకాల్ పాటించనందున జన్నారం ఇన్‌చార్జి సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శేష రాంను సస్పెండ్ చేస్తున్నట్లు ఎఫ్‌డీపీటీ శాంతారాం గురువారం ఆదేశాలు జారీ చేశారు.

# 60 డివిజన్లు.. 1.79లక్షల ఓటర్లు




- ముసాయిదా జాబితా సిద్ధం
- 11 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అనంతరం తుది ముసాయిదా జాబితా విడుదల
- తుదిరూపం దిద్దుకోనున్న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్

మంచిర్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ తుదిరూపం దిద్దుకోనుంది. ఇప్పటికే కార్పొరేషన్‌గా ప్రకటిస్తూ గెజిట్ కూడా విడుదలైంది. మొత్తంగా లక్ష79వేల 516 మంది ఓటర్లతో 60డివిజన్లుగా అవతరించనుంది. ఇందుకు సంబంధించిన డివిజన్ల ప్రక్రియ పూర్తి కాగా ఈ నెల 11వరకు అధికారులు ప్రజలనుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అలాగే 12నుంచి 16వతేదీ వరకు స్వీకరించిన అభ్యంతరాలపై కసరత్తు చేసి కలెక్టర్ ఆమోదం తీసుకోనున్నారు. 19న పురపాలకశాఖకు నివేదించి, 21వ తేదీన తుది ముసాయిదా జాబితా విడుదల చేయనున్నారు. దీంతో డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పూర్తి కానుంది. ఒక్కో డివిజన్‌లో 2700 నుంచి 3300 వరకు ఓటర్లను కేటాయించారు.

**● విలీన గ్రామాలతో...**

మున్సిపాలిటీగా ఉన్న మంచిర్యాలలో సమీప గ్రామాలు, నస్పూర్ మున్సిపాలిటీని కలిపి ప్రభుత్వం కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. సమీప గ్రామాలైన వేంపల్లి, కొత్తపల్లి, ముల్కల్ల, గుడిపేట, నర్సింగా పూ ర్, చందనాపూర్‌తో పాటు నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్, సీతరాంపల్లి, సీసీసీ, నస్పూర్ గ్రామాలను విలీనం చేశారు. ప్రస్తుతం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో 2,48,283 మంది జనాభా ఉన్నారు.

**● ఎన్నికలకు సిద్ధం..**

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ప్రభుత్వం ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తోంది. వార్డుల విభజన ప్రక్రియ పూర్తికాగానే రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికలకు సమాయత్తం కావాలని సీఎం సూచించిన నేపథ్యంలో అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ముందే పురపాలక సంఘాల సమరానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. జూలై మూడోవారంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు మున్సిపాలిటీల..

(మిగతా 7లో)

## సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, జూన్5(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చుననీ ఏసీపీ రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో కాలనీవాసులు, వ్యాపార సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో తాళ్లగురిజాల సీఐ అఫ్జలోద్దీన్, ఎస్ఐ మహేందర్, మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్, నెల్లి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడిగా సూరత్ నాయక్



బెల్లంపల్లి, జూన్5(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడిగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన సూరత్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్ర భవనంలో రాష్ట్ర సేవాలాల్ ముఖ్య సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో జిల్లా అధ్యక్షుడిగా సూరత్ నాయక్‌కు సంఘం రాష్ట్ర నాయకుడు సంజీవ్‌నాయక్ నియామకపత్రం అందజేశారు.

## పచ్చిరొట్ట, ఎరువుల ధరలను తగ్గించాలి

జన్నారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట, ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ పలువురు రైతులు జాడి గంగాధర్ ఆధ్వర్యంలో ఏవో సంగీతకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో పచ్చిరొట్టే ఎరువులు, జనుములు, జీలుగు, పెసర్లకు ఒకేసారి రెండింతల రేట్లు పెంచడంతో ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మలావత్ ప్రేంసింగ్, బానావత్ సంతోస్, జినుగురు మల్లయ్యలు పాల్గొన్నారు.

## టీజీఆర్‌జేసీకి మల్కాపల్లి ఆశ్రమ విద్యార్థుల ఎంపిక



అరవింద్, హరీశ్

కాసిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకుల జూనియర్ కాలేజీకి మల్కాపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మే నెలలో తెలంగాణ గురుకుల కాలేజీకి అర్హత పరీక్ష నిర్వహించగాఈ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు టీపీ అరవింద్, ఈ. హరీశ్ ఎంపికైనట్టు తెలిపారు. కుటుంబసభ్యులు, పాఠశాల సిబ్బంది పలువురు అభినందించారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలకలెక్టరేట్, జూన్5(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాల కోసం గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి గాను మంచిర్యాల జిల్లాకు 33 సీట్లు కేటాయించగా 3వ తరగతిలో 17 సీట్లు, 5 తరగతిలో 8సీట్లు, 8వ తరగతిలో 8సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా గిరిజనాబివృద్ధిశాఖ కార్యాలయంలో దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుకు బోనఫైడ్, కులం, ఆదాయం, నివాసం ధ్రువీకరణ పత్రం జతపరిచి ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5గంటలలోగా కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1లక్షా 50వేల రూపాయులు, పట్టణ ప్రాంతాల వారికి 2లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## సింగరేణిలో ప్లాస్టిక్‌పై సంపూర్ణ నిషేధం: సీఎండీ

శ్రీరాంపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ హైదరాబాద్ కార్యాలయంతో పాటు అన్ని ఏరియాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా నిషేధిస్తున్నట్లు సీఎండీ ఎన్. బలరాం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మొక్కలు నాటి సందేశం ఇచ్చారు. 'ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం' అనే నినాదాన్ని ఈ ఏడాది తీసుకున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించవద్దన్నారు. సింగరేణిలో ఇప్పటికే పలు పర్యావరణ హితమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గనులు, విభాగాలలో ఇక నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్లేట్లు, వస్తువులు, తదితరాలపై ఇక నుంచి సంపూర్ణ నిషేధం అమల్లో ఉంటుందన్నారు. కార్మికులు, ఉద్యోగులు సహకరించాలని, ఇంటివద్ద కూడా ప్లాస్టిక్‌ను వాడవద్దని ఆయన సూచించారు. పర్యావరణంపై అభిమానంతో తాను ఇప్పటికే 19 వేల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని కార్మికులు, ఉద్యోగులు, డైరెక్టర్లు అందరూ ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారికి సంస్థ నుంచి ఉచితంగా మెక్కలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈడీ(కోల్ మూమెంట్) సుభానీ, జీఎం(మార్కెటింగ్) రాజశేఖర్‌రావు, ఇతర విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పదో తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. బాలికలకు హాస్టల్ వసతి ఉంద, అర్హత ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 13లోగా నేరుగా మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

**- మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి రమమోహన్ రెడ్డి - ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం**



కోర్టు ఆవరణలో మొక్కలను నాటుతున్న జడ్జి రమమోహన్ రెడ్డి,



ప్రతిజ్ఞ చేస్తున్న రాష్ట్ర వాల్టా అథారిటీ సభ్యుడు యోగేశ్వర్

లక్షెట్టిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణం కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి డి రమమోహన్ రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకుని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్‌తో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ పర్యావరణం పెంపొందించాలంటే విధిగా ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని కూడా పూర్తిగా తగ్గించుకోవాలని సూచించారు. మొక్కలు, చెట్లు లేకపోవడంతోనే రోజు రోజుకు భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని, అడవుల్లో చెట్లు లేక జంతువులు జనవాసాల్లోకి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో లక్షెట్టిపేట అటవీక్షేత్ర అధికారి అత్తె సుభాష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ఏజీపీ సత్యం, సీనియర్ న్యాయవాదులు అక్కల శ్రీధర్, కారుకూరి సురేందర్, రవీందర్‌రావు, నళినికాంత్, నేరెళ్ల పద్మ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

**● లక్షెట్టిపేట:** లక్షెట్టిపేట ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో బాగంగా మున్సిపాలిటీ ఆద్వర్యంలో పలు వార్డుల్లో సిబ్బంది మొక్కలను నాటారు. ప్రజలకు తడి పొడి చెత్త సేకరణపై తవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్స్ ప్రశాంత్, నరేష్‌తో పాటు సిబ్బంది కట్ల రాకేష్, శంకరయ్య ఉన్నారు.

**మంచిర్యాలకలెక్టరేట్:** ప్రతీ పౌరుడు ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పాటుపడాలని వాల్టా అథారిటీ సభ్యుడు గుండేటి యోగేశ్వర్ సూచించారు. గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని..

(మిగతా 7వ పేజీలో..)

## ఓరియంట్ కార్మిక సంఘాలతో సమావేశం వాయిదా

కాసిపేట,జూన్5(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీఎల్ కార్యాలయంలో గురువారం ఓరియంట్ కార్మికుల సంఘాలతో జరగాల్సిన సమావేశం తాత్కాలికంగా వాయిదాపడింది. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో జరుగాల్సిన గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియపై గురువారం ఆదిలాబాద్ డిప్యూటి లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం జరగాల్సి ఉంది.

కానీ అనివార్యకారణాల వల్ల సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో దేవాపూర్ నుంచి వందల సంఖ్యలో తరలివెళ్లిన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు నిరాశతో తిరిగి వచ్చారు. ఓరియంట్ ఎన్నికల తేదిని ప్రకటిస్తారని సమావేశానికి వెళ్లిన కార్మికులు సమావేశం వాయిదా పడడంతో అసహనం వ్యక్తం చేశారు. ఎలాగైనా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## రోస్టర్ ప్రకారమే ఉద్యోగులకు పదోన్నతులు

శ్రీరాంపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు రోస్టర్ ప్రకారమే పదోన్నతులు కల్పిస్తామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్సీ రోస్టర్ రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ కమిటీ (కార్పొరేట్) సభ్యులు గురువారం ఏరియాను సందర్శించగా, ఆయన వారి తో సమావేశమై మాట్లాడారు. ఎస్సీ ఉద్యోగుల రోస్టర్ రిజిష్టర్లను ఎస్సీ చీఫ్ లైజన్ అధికారి దుర్గం రాంచందర్, కమిటీ సభ్యులు ఖాళీల భర్తీ, పదోన్నతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఓసీపీ పీవో టి శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, ఏరియా లైజన్ అధికారి కిరణ్ కుమార్, కమిటీ సభ్యులు రాజేశ్వర్, వెంకటేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావు, తిరుపతి, ఎస్‌వీ రాజేశ్వరరావు, ఎస్‌సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో సరిపడా సన్నబియ్యం నిల్వలు: కలెక్టర్



రేషన్ బియ్యం లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సన్నబియ్యం నిల్వలు పంపిణీకి సరిపడా ఉన్నాయని, కార్డుదారులు ఆందోళన చెందాల్సినవరం లేదని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని 5,8 నంబర్ల రేషన్ షాపులను గురువారం కలెక్టర్ సందర్శించి బియ్యం పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. కార్డుదారులతో కలెక్టర్ మాట్లాడారు. పంపిణీ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యంను ఈ నెల 30వ తేదీ వరకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తామన్నారు. సాంకేతిక సమస్య తలెత్తితే ఈ-పాస్ ఇంజనీర్లు పరిష్కారం చేస్తారని, సజావుగా పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకుంటమన్నారు. సన్న బియ్యం నిల్వలు పంపిణీకి సరిపడా ఉన్నయని, కార్డుదారులు ఆందోళన చెందాల్సినవరం లేదన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉంటుందని, నిల్వలు అవసరం ఉన్నట్లయితే వెంటనే సంప్రదిస్తే తక్షణమే సరఫరా చేస్తామని కలెక్టర్ అన్నారు.

**ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు**

**మంచిర్యాల కలెక్టరేట్:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్‌లో గల ఈవీం గోదామును ప్రత్యేక ఉపపాలనాధికారి డి చంద్రకళ, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సంబంధిత సామగ్రిని భద్రపరిచి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. త్రైమాసిక పరిశీనలో భాగంగా అధికారులు, పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎంలను పరిశీలించామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, భద్రత సిబ్బంది పర్యవేక్షణలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణా నివారణకు చర్యలు



గూడెం చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

దండేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా నివారణకు జిల్లా సరిహద్దులోని గూడెం చెక్‌పోస్టు వద్ద పకడ్బందీ చర్యలు చేపట్టి వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. మంచిర్యాల-జగిత్యాల జిల్లాల సరిహద్దులో దండేపల్లి మండలం గూడెం చెక్‌పోస్టును గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈనెల 7న బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, ఎద్దులు, కోడే దూడలను అక్రమంగా తరలించకుండా ఉండేందుకు గూడెం చెక్‌పోస్టు వద్ద ప్రతీరోజు వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. పోలీసు, పశుసంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా చెక్‌పోస్టులలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే బాధ్యులపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణంలో బక్రీద్ పండగ జరుపుకోవాలని సూచించారు. అనంతరం చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. డీసీపీ వెంట లక్షెట్టిపేట సీఐ డి రమణమూర్తి, దండేపల్లి, లక్షెట్టిపేట ఎస్సైలు ఎండి తహసీనోద్దీన్, గోపతి సురేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు

దండేపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు ఫర్టిలైజర్ షాప్‌లో విక్రయిస్తే కఠిన చర్యలతో పాటు షాప్ లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి గొర్ల అంజిత్ కుమార్ దండేపల్లి ఎస్సై తహసీనోద్దీన్ హెచ్చరించారు. గురువారం దండేపల్లితో పాటు పలు గ్రామాల్లోని కలెక్టర్ ఆదేశారసారం వ్యవసాయ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీలు చేపట్టారు. వారు మాట్లాడుతూ నకిలీపత్తి విత్తనాల బెడద నుంచి రైతులు మోసపోవద్దని దానికి అనుగుణంగా ప్రతి విత్తన షాపులో నాణ్యమైన విత్తనాల ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు అమ్మినా, విత్తనాలు సరఫరాలో హస్తం ఉన్నట్లు తెలిసినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా షాప్‌లో స్టాక్ రికార్డులు, బిల్లు బుక్‌లను పరిశీలించారు. ప్రభుత్వం ఆమోదించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. కొనుగోలు చేసిన రైతుకు రసీదు తప్పసరిగా ఇవ్వాలన్నారు. షాప్ యాజమాన్యాలు నిర్ణీత ధర కంటే అధిక డబ్బులు తీసుకుంటే రైతులు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులు, మందులను తనిఖీ చేశారు.



విత్తనాల ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న ఎస్సై, ఏవో

# అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే



ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులతో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

కోటపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. మండలంలోని కొల్లూరు, రాంపూర్, దేవులవాడ, రాజారాం, బబ్బెరచెలక, లక్ష్మీపూర్, వెల్మపల్లి, అన్నారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. విడతల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు. మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని, పనులపై ప్రణాళికల పరంగా నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు.

ఇప్పటికే మండలంలో పలు రహదారులు, బ్రిడ్జిల నిర్మాణం కొనసాగుతోందని, వర్షాకాలం ప్రారంభం నాటికి పనులను పూర్తి చేయిస్తామన్నారు. అలాగే అటవీశాఖ అనుమతులు లేక నిలిచిపోయిన రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అనుమతులు రాగానే పనులను చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో అక్తర్ మొహియొద్దీన్, పలువరు పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.